ఎబిడిఎం సేవలు ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిబినగర్ ఎయిమ్స్‌లో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఎబిడిఎం) సేవలను కేంద్ర ఆరోగ్య మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేయడానికి కేంద్రం ఈ మిషన్‌ను ప్రారంభించిందని తెలిపారు. ఈ మిషన్ ద్వారా రోగులకు ఏ హాస్పిటల్ నుంచైనా హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ద్వారా సేవలందించేందుకు వీలు కలుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ (డాక్టర్) వికాస్ భాటియా తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్లు, లైట్లు, ఏసీలు అనవసరంగా వాడొద్దు

టిఎస్ రెడ్కో చైర్మెన్ సతీష్‌రెడ్డి

ప్రజాశకి -హైదరాబాద్‌బ్యూరో

ఇండ్లు, ఆఫీసులు, ఇతర ప్రాంతాల్లో లైట్లు, ఫ్యాన్లు, ఏసీలను ఇష్టం వచ్చినట్టు వినియోగించవద్దని టిఎస్ రెడ్కో చైర్మెన్ వై సతీష్‌రెడ్డి అన్నారు. విద్యుత్‌ను పొదుపుగా వాడితే, పర్యావరణాన్ని పరిరక్షించినట్టే అని చెప్పారు. ఇంధన పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఆధ్వర్యంలోని ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ నిర్వహించిన ఎనర్జీ వాక్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఖైరతాబాద్‌లోని ఇంజినీర్స్ ఇనిస్టిట్యూట్ భవనం దగ్గర ప్రారంభమైన వాక్.. ఖైరతాబాద్ ఫ్లై ఓవర్, ఎన్టీఆర్ మార్గ్, తెలుగుతల్లి ఫ్లై ఓవర్ నుంచి తిరిగి ఇంజినీర్స్ ఇనిస్టిట్యూట్ వరకు సాగింది. ఈ సందర్భంగా రెడ్కో చైర్మెన్ వై సతీష్ రెడ్డి మాట్లాడుతూ.. కర్బన ఉద్గారాలను తగ్గించడానికి విద్యుత్ పొదుపు కూడా ఓ భాగమన్నారు. ఇంధన వాడకం పెరిగి, ప్రపంచం కాలుష్యమయం అయిపోతున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణాన్ని బహుమతిగా ఇవ్వాలని సూచించారు. ఇంధన పరిరక్షణ, కాలుష్య రహిత పర్యావరణం కోసం రెడ్కో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. విద్యుత్ పరిరక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీల్లో ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఎల్ఈడీ లైట్లు, బీఎల్‌డీసీ ఫ్యాన్లు బిగిస్తున్నామని చెప్పారు. సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఎనర్జీ వాక్‌లో పలు కాలేజీలకు చెందిన విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ చైర్మెన్ బ్రహ్మరెడ్డి, ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ చైర్మెన్ శ్రీనివాసాచారి, ఇంజినీర్స్ ఇనిస్టిట్యూట్ సభ్యులు, పలు కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు

పిసిసి పదవులకు 12 మంది రాజీనామా

- పార్టీ అభివృద్ధికి పనిచేస్తామని ఎఐసిసికి లేఖ
- కాంగ్రెస్ సీనియర్లకు చెక్ పెట్టేందుకు రేవంత్ వ్యూహం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిసిసి పదవుల ప్రకటనతో కాంగ్రెస్ సీనియర్లలో రేగిన అసంతృప్తి జ్వాలను చల్లార్చేందుకు టిపిసిసి అధ్యక్షుడు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. వలస నాయకులకే పదవుల్లో ప్రాధాన్యం ఇచ్చారని రచ్చకెక్కిన సీనియర్లకు చెక్ పెట్టడంతోపాటు పార్టీ శ్రేణుల్లో సానుభూతి వచ్చేలా పథక రచన చేశారు. రేవంత్‌రెడ్డితోపాటు టిడిపి నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన నాయకులు సీతక్క, వేం నరేందర్ రెడ్డి, సిహెచ్ విజయరమణారావు, దొమ్మాటి సాంబయ్య, కవ్వంపల్లి సత్యనారాయణ, వజ్రేశ్ యాదవ్, చారగొండ వెంకటేశ్, సుభాష్ రెడ్డి, పటేల్ రమేశ్ రెడ్డి, చిలుక మధుసూధన్ రెడ్డి, సత్తు మల్లేశ్, శశికళ యాదవరెడ్డి పార్టీ పదవులకు ఆదివారం రాజీనామా చేశారు. పదవుల పేరుతో గిల్లికజ్జాలు పెట్టుకొని ప్రజా సమస్యలను గాలికొదిలేయడం మంచిదికాదని, పదవుల వివాదానికి ముగింపు పలికేందుకు తమ పదవులకు రాజీనామా చేస్తున్నామని తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల బాధ్యుడు మాణిక్కం ఠాగూర్‌కు ఐదు పేజీల లేఖ రాశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని ప్రకటించారు.పిసిసి అధ్యక్షుడుగా రేవంత్‌రెడ్డిని ప్రకటించిన నాటి నుంచి గుర్రుగా ఉన్న సీనియర్లకు పిసిసి పదవులు తీవ్ర అసహనానికి గురిచేసింది. తమను సంప్రదించలేదని కొందరు, పాతవాళ్లకు ప్రాధాన్యం ఇవ్వలేదని, తన మనుషులకే పదవులు పందేరం చేశారని మరికొందరు రేవంత్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాసనర్సింహ రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో మీడియా సమావేశం పెట్టి తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. తనకు ప్రాధాన్యంలేని పదవి ఇచ్చారని మాజీ మంత్రి కొండా సురేఖ పార్టీ పదవికి రాజీనామా చేశారు. శనివారం సిఎల్పి నేత భట్టి విక్రమార్క ఇంట్లో సీనియర్లు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ్మ, జగ్గారెడ్డి, మధుయాష్కీగౌడ్, మహేశ్వర్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావు, సంజీవరెడ్డితోపాటు మరికొంత మంది నాయకులు సమావేశమయ్యారు. సిఎల్పి నేత భట్టి కూడా రేవంత్‌కు వ్యతిరేకంగానే స్పందించారు. ఢిల్లీలోనే తేల్చుకుందామని వారు నిర్ణయించుకున్నారు. సీనియర్ల ఆరోపణలపై రేవంత్ రెడ్డి ఎక్కడా స్పందించలేదు. తమ వారితో పార్టీ పదవులకు రాజీనామా చేయించారు. పదవుల పందేరంలో రేవంత్‌ను ఏకాకిని చేయాలనుకున్న సీనియర్లకు వ్యూహాత్మకంగా చెక్ పెట్టినట్లయింది. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారంలో పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డినే కాన్ఫిడెన్స్‌లోకి తీసుకున్న ఎఐసిసి... ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకోలేదని తెలిసింది. ఒకరిద్దరు సీనియర్లు హైకమాండ్‌తో మాట్లాడే ప్రయత్నం చేసినా వీలుకాలేదని ఓ సీనియర్ నాయకులు తెలిపారు. బిఆర్ఎస్‌ను ఓడించి తెలంగాణలో అధికారంలోకి రావాలనుకుంటున్న కాంగ్రెస్.. పదవులు, ప్రాధాన్యతలంటూ ప్రజల్లో చులకనవుతోంది. రాజీనామాలతోనైనా పార్టీలో విబేధాలు సర్దుకుంటాయా.. లేక ఇంకా ముదిరిపాకాన పడతాయా అనికాంగ్రెస్ శ్రేణుల్లో చర్చ జరుగుతుంది.

వ్యాయామ పోస్టులు భర్తీ చేయాలి

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని బిసి సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఆదివారం తెలంగాణ నిరుద్యోగ, ప్రైవేట్ వ్యాయామ విద్యా ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పిఇటి, పిడి పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వ్యాయామ విద్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాలయాల్లో మొత్తం 22,600 పిఇటి, పిడి పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. వాటిని భర్తీచేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఆమ్‌ఆద్మీపార్టీ తెలంగాణ కోర్ కమిటీ సభ్యురాలు ఇందిరాశోభన్, టియుపిఇటిఎ అధ్యక్షుడు మాదగోని సైదులు గౌడ్, బిసి సంక్షేమ సంఘ జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, నిరుద్యోగ జెఎసి చైర్మన్ నీల వెంకటేష్, బిసి సంక్షేమ సంఘం నాయకులు రూపేషసాగర్, రాజ్‌కుమార్, టియుపిఇటిఎ నాయకులు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



న్యూ ఇయర్ వేడుకలకు నిబంధనలు

- 10 రోజుల ముందే పబ్‌లు అనుమతి తీసుకోవాలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరం నూతన సంవత్సర వేడుకలకు సిద్ధం అవుతోంది. ఈ సారి మరింత ఘనంగా కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు నగరవాసులు ఎదురుచూస్తున్నారు. ఇందుకు తగ్గట్టుగానే ప్రత్యేకంగా వేడుకల కోసం నిర్వాహకులు, యాజమాన్యాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. అయితే, నగరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసేందుకు హైదరాబాద్ పోలీసులు నిబంధలను విధించారు. వేడుకలను రాత్రి ఒంటిగంట వరకూ నిర్వహించుకునేందుకు 3 నక్షత్ర, అంతకంటే పెద్ద హోటళ్లు, పబ్బులు, క్లబ్బుల నిర్వహకులు, యాజమాన్యాలు 10 రోజుల ముందు గానే పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాలని తెలిపారు. వేడుకలు నిర్వహించే ప్రాంగణంలో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు, పార్కింగ్ ప్రదేశాల్లోనూ సీసీ కెమెరాలు అమర్చాలని, ట్రాఫిక్ క్లియరెన్స్‌కు సెక్యూరిటీ గార్డులను నియమించుకోవాలని సూచించారు. అసభ్యకర నృత్యాలు, అల్లర్లు జరగకుండా చూడాలని.. వేడుకల ప్రాంగణంలో శబ్ద తీవ్రత 45 డెసిబెల్స్ మించకూడదని ఆదేశించారు. మారణాయుధాలను వేడుకల ప్రాంతాల్లోకి అనుమతించకూడదని, ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి అనుమతించాలని సూచించారు. నిర్దిష్ట పరిమితికి మించి టికెట్లు, పాసులు జారీ చేస్తే చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ సిపి సివి ఆనంద్ హెచ్చరించారు. నిర్వహకులు ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేయాలని.. సాధారణ ట్రాఫిక్‌కు ఎలాంటి ఆటంకం కలగకూడదని పేర్కొన్నారు. మైనర్లను అనుమతించకూడదన్నారు. వేడుకల్లో మాదక ద్రవ్యాలు సరఫరా జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత యాజమాన్యాలదేనని తెలిపారు. ఎక్సైజ్ శాఖ అనుమతించిన సమయం దాటిన తర్వాత మద్యం సరఫరా చేయకూడదని.. వేడుకల తర్వాత మద్యం సేవించిన వారు వాహనం నడపకూడదని, వారు ఇంటికి చేరేలా చూసే బాధ్యత యాజమాన్యాలదేనని స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌ను బలహీనపరిచే కుట్ర

ఈరవత్రి అనిల్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీని, రేవంత్‌రెడ్డిని బలహీనపర్చే కుట్ర జరుగుతున్నదని మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 26 నుంచి పాదయాత్ర చేయాలని కాంగ్రెస్ పార్టీ ప్రణాళిక సిద్ధం చేస్తుంటే, పాదయాత్రను దెబ్బతీయాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. పార్టీ ముసుగువీరులు ఇప్పుడు బయటకు వచ్చారన్నారు. ఆదివారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. 12 మంది ఎమ్మెల్యేలు పార్టీని వీడినప్పుడు సేవ్ కాంగ్రెస్ ఎందుకు గుర్తు రాలేదు? ఆనాడు పిసిసిగా ఉన్నవాళ్లు ఏం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మునుగోడు ఉప ఎన్నికల్లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తే ఉత్తమ్ ఏం చేశారని ప్రశ్నించారు. సీనియర్లు పార్టీకోసం పనిచేస్తే మునుగోడులో 50వేల ఓట్లతో గెలిచే వాళ్లమని పేర్కొన్నారు. సునీల్ కనుగోలు కార్యాలయంపై దాడి జరిగితే సీనియర్లు ఎక్కడికి పోయారని నిలదీశారు. మీ లోపాయికారీ ఒప్పందం భాజపాతోనా లేక బిఆర్ఎస్‌తోనా? అని ప్రశ్నించారు. పార్టీ కార్యకర్తల మనోధైర్యాన్ని దెబ్బతీస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్వార్థం కోసం టిడిపితో పొత్తు పెట్టుకోలేదా? అని ప్రశ్నించారు. సిఎల్పినేత భట్టి కమిటీల సమాచారం లేదనేది అసత్యమన్నారు. 'సునీల్ కనుగోలు కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తారు.. పార్టీ నేతలపై ఆయన ఎందుకు పోస్టులు పెడతారు? ఉత్తమ్‌పై సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టినట్టు ఆధారాలు ఉన్నాయా? సిపి ఆనంద్ ఎలా చెబుతారనీ, దాన్ని మీరెలా నమ్ముతారు?' అని ప్రశ్నించారు.

జనవరి 26 నుంచి రేవంత్ పాదయాత్ర

- అదే రోజు కాంగ్రెస్ జెండా పండుగ
- కార్యవర్గ నిర్ణయాలను వెల్లడించిన రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి సర్కారు, రాష్ట్రంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం...ప్రజలకు చేస్తున్న అన్యాయాన్ని వివరించేందుకు (యాత్ర ఫర్ ఛేంజ్) జనవరి 26 నుంచి పాదయాత్రకు శ్రీకారం చుట్టనున్నట్టు పిసిసి అధ్యక్షులు, ఎంపి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. అంతలోపు గ్రామ, మండల, నియోజకవర్గం, జిల్లా స్థాయి కమిటీలను పూర్తి చేయాలని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. జనవరి 26న గ్రామ, గ్రామానా కాంగ్రెస్ పార్టీ జెండా పండుగ నిర్వహించాలని కోరారు. ప్రధాని మోడి, సిఎం కెసిఆర్ వైఫల్యాలపై చార్జిషీట్ పేరుతో ఇంటింటికి కరపత్రం పంచుతామని చెప్పారు. కాంగ్రెస్ జోథ్‌పూర్ డిక్లరేషన్ ప్రకారం ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలు, బిసిలకు 50 శాతం పదవులు ఇవ్వాలని నిర్ణయించిందనీ, దాని ప్రకారమే రాష్ట్రంలో 66శాతం పదవులు ఆయా తరగతులకు ఇచ్చామని గుర్తు చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో రేవంత్ అధ్యక్షతన నూతన కార్యవర్గం సమావేశమైంది. తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. భవిష్యత్తు కార్యాచరణను నిర్ణయించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను పార్టీ నేతలు అంజన్‌కుమార్ యాదవ్, షబ్బీర్ అలీ, సుదర్శన్‌రెడ్డి, మల్లురవి, చెరుకు సుధాకర్, శంకర్‌నాయక్, దర్పల్లి రాజశేఖర్‌రెడ్డితో కలిసి రేవంత్ విలేకర్లతో మాట్లాడారు. నూతన జిల్లా అధ్యక్షులు క్షేత్రస్థాయి కమిటీలను నియమించాలని కోరారు. కాంగ్రెస్ ఎన్నికల నియామావళి, ప్రభుత్వాల వైఫల్యాలపై జనవరి 3,4,5 తేదీల్లో మేధావులతో శిక్షణ ఇప్పిస్తామని చెప్పారు. డిజిటల్ సభ్యత్వం పొందిన 43 లక్షల మందికి రెండు లక్షల బీమా సౌకర్యంతోపాటు రానున్న ప్రభుత్వంలో సరైన అవకాశాలు కల్పించనుందని భరోసా ఇచ్చారు. పార్టీ కార్యక్రమాలను, ప్రభుత్వ వైఫల్యాలను సోషల్‌మీడియా ద్వారా ప్రజలకు వివరించాలని పార్టీ కార్యకర్తలను కోరారు. పార్టీ అంతర్గత సమస్యలను అధిష్టానం పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులపై సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడుతున్న వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ అబద్ధాలు చెప్పి పార్టీలో అంతర్గత సమస్యలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ వార్‌రూమ్ పోలీసులు రౌడీముకలుగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐఐటి, ఐఐఎం చదవిన మేధావులపై క్రైమ్ పోలీసుస్టేషన్లతో అర్ధనగ్నంగా కూర్చొబెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన ఎన్నికల వ్యూహానికి సంబంధించిన సమాచారాన్ని దొంగిలించారని ఆరోపించారు. డిజిపి పదవి కోసం టిఆర్ఎస్ బ్రోకర్ గిరి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.



మలబార్ గోల్డ్ బ్రాండెడ్ జ్యువలరీ షో

హైదరాబాద్ : ప్రముఖ అభరణాల విక్రయ రిటైల్ సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స్ తన సోమాజిగూడ షోరూంలో "అర్టిస్టీ బ్రాండెడ్ జ్యువెల్లరీ షో" ప్రదర్శనను ఏర్పాటు చేసింది. దీన్ని ఆ సంస్థ ప్రతినిధుల సమక్షంలో ఇండియన్ సినిమా ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్‌సాయి, నటీ ఆనంద్ వాసుకి లాంఛనంగా ప్రారంభించారు. ఈ ప్రదర్శన డిసెంబర్ 25 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఇక్కడ బంగారం, వజ్రాభరణాలు, జాతి రత్నాభరణాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా 22 క్యారెట్ల పాత బంగారం మార్పిడిపై సున్నా శాతం తగ్గింపును అందిస్తున్నామన్నారు.



బోడుప్పల్‌లో ఎ టూ జెడ్ జనరిక్ మెడికల్ స్టోర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ పల్లా

ఫార్మసీ రంగానికి ప్రభుత్వ ప్రోత్సాహం

- ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఫార్మసీ రంగాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్సీ, రైతు బంధు కమిటీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎ టూ జెడ్ జనరిక్ మెడికల్ స్టోర్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. ఫార్మసీ రంగాన్ని అభివృద్ధి చేసి సామాన్య ప్రజలకు అవసరమైన మందులను అతితక్కువ ఖర్చుతో అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టిందని తెలిపారు. భవిష్యత్తులో బి ఫార్మసీ చదివిన దళిత విద్యార్థులకు దళిత బంధు ద్వారా జనరిక్ మెడికల్ స్టోర్లు ఏర్పాటు చేసుకునే సదుపాయాన్ని కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ సామల బుచ్చిరెడ్డి, స్థానిక కార్పొరేటర్ జడిగే మహేందర్ యాదవ్, బిఆర్ఎస్ బోడుప్పల్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, అద్విత గ్లోబల్ మెడికల్ ప్రయివేట్ లిమిటెడ్ నిర్వాహకులు సురేష్, హరీష్, ఎ టూ జెడ్ మెడికల్ స్టోర్ నిర్వాహకులు తోట సతీష్, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బాలల సుస్వర లయబద్ధ గానం

ప్రజాశక్తి - కల్చలర్

సుస్వర మ్యూజిక్ అకాడమీ నిర్వహణలో శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళావేదికపై చందమామ రావే శీర్షికన సినీ సంగీత విభావరి జరిగింది. ప్రముఖ స్వరకర్త నాగరాజు ప్రసాద్ శిష్య బృందం లక్ష్మీ మేఘన, సాయి రమ్య,కార్తీక, హారిక, తన్వి శ్రీ,లాస్య ప్రియ తదితరులు మధురంగా గానం చేశారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పోలీస్ ఉన్నతాధికారి మహంకాళి రామమూర్తి పాల్గొని మాట్లాడారు. ప్రతిభ కలిగిన గురువుకు మంచి శిష్యులు లభించటం అదృష్టమన్నారు. సిటీ కల్చరల్ సెంటర్ నిర్వహకుడు పురుషోత్తం అధ్యక్షత వహించగా కవి సురేష్, రచయిత్రి లలితా శేఖర్ తది తరులు పాల్గొన్నారు. నిర్వహకుడు నాగ రాజు ప్రసాద్ స్వాగతం పలుకుతూ యువ కళా వాహిని స్థాపకుడు వై.కె.నాగేశ్వర రావుకు కార్యక్రమం అంకితమిచ్చామని తెలిపారు.

కామన్ స్కూల్ విధానంతోనే సమాన విద్య

- ఉపాధ్యాయులు హక్కులను కాపాడుకోవాలి
- టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కామన్ స్కూల్ విధానంతోనే అన్ని వర్గాల ప్రజలకు సమాన, నాణ్యమైన విద్య అందించడం సాధ్యమవుతుందని టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి అన్నారు. ప్రభుత్వాలు ఆ దిశగా దృష్టిసారించాలని సూచించారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంతోపాటు విద్యా వ్యాపారీకరణను అడ్డుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. వీటితోపాటు ఉపాధ్యాయుల హక్కులను కూడా కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బి విశ్రాంతి భవనం ఎదుట టిఎస్‌యుటిఎఫ్ జిల్లా మహాసభ ఆదివారం జరిగింది. తొలుత రాష్ట్రంలోని విద్యారంగ సమస్యలు, పరిష్కార మార్గాలు అనే అంశంపై విద్యా సదస్సు ఏర్పాటు చేశారు. అనంతరం ప్రతినిధుల సభను నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టిఎస్‌యుటిఎఫ్ ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాణంలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొని నిలబడిందని గుర్తు చేశారు. కోవిడ్ కాలంలో చేసిన పోరాటాల ఫలితంగా పిఆర్‌సిని సాధించుకున్నామని చెప్పారు. మరోపక్క కేంద్రం ఒకే దేశం.. ఒకే విద్య పేరిట తీసుకొచ్చిన నూతన విద్యా విధానం లోపభూయిష్టంగా ఉందని విమర్శించారు. రాష్ట్రాల అధికారాలను పూర్తిగా కట్టడి చేసి కేంద్రీకృతం చేస్తోందన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ యూనివర్సిటీలను మూసివేయించి ప్రయివేటును పెంచేలా ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. విద్యా వ్యాపారాన్ని ప్రోత్సహించేందుకే కేంద్రం ఎన్ఇపి-2020ను తీసుకొచ్చిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం విద్యా వ్యవస్థ పట్ల నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందన్నారు. తెలంగాణలో కెజి టు పిజి విద్యలో భాగంగా కామన్ స్కూల్ విధానం అమలవుతోందని భావించామని, కానీ కేజీ, పీజీ లేని గురుకులాలు పెట్టారని తెలిపారు. రాష్ట్రంలో 60 లక్షల మంది విద్యార్థులు ఉంటే గురుకులాల్లో కేవలం 5 లక్షల మంది మాత్రమే చదువుతున్నారని, మిగతా 25 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతుండగా మిగతా 30 లక్షల మంది ప్రయివేటులో చదువుతున్నారని తెలిపారు. ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న 25 లక్షల మందికి నాణ్యమైన విద్య ఎక్కడ లభిస్తుందని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల నియామకాలను భర్తీ చేయాలని, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. మహాసభలో జిల్లా విద్యాశాఖాధికారి టి.ప్రణీత, సెక్టోరల్ అధికారి కంటె నర్సయ్య, టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకట్, సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాస్, వి.అశోక్, రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ లక్ష్మణ్‌రావు, జిల్లా బాధ్యులు కె.కిష్టన్న, సూర్యకుమార్, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య


- సీడ్ ఆర్గనైజర్ డబ్బులు ఇవ్వకపోవడమే కారణమని బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సీడ్ ఆర్గనైజర్ డబ్బులు చెల్లించలేదని పురుగులమందు తాగిన ఓ రైతు చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ సంఘటన కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గంగారం గ్రామానికి చెందిన రైతు మడికొండ లింగయ్య (65)ను అదే గ్రామానికి చెందిన సీడ్ ఆర్గనైజర్ నల్ల మధూకర్‌రెడ్డి గత యాసంగిలో అధిక దిగుబడి వస్తుందని నమ్మించడంతో వరి పంట వేశారు. ఆ తరువాత పండిన పంటకు రూ.2.50 లక్షల విలువగల ధాన్యాన్ని కొనుగోలు చేసి తీసుకెళ్లారు. కానీ డబ్బులు ఇవ్వలేదు. అప్పటి నుంచి అతని చుట్టూ పలుమార్లు తిరిగినా డబ్బులు ఇవ్వకుండా తిప్పించుకుంటుండడంతో విసిగిన లింగయ్య ఈ నెల12న మధూకర్‌రెడ్డి ఇంటి ఎదుట పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు, కుటుంబీకులు కరీంనగర్‌లో ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. దాంతో కోపోద్రిక్తులైన గ్రామస్తులు, బంధువులు లింగయ్య మృతదేహాన్ని తీసుకుని మధూకర్‌రెడ్డి ఇంటి ఎదుట అందోళన చేసేందుకు వెళ్తున్నారన్న సమాచారంతో పోలీసులు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దాంతో గ్రామస్తులు కొంతసేపు గ్రామంలో ఆందోళన చేపట్టారు. పోలీసులు ఇరువురిని సముదాయించి శాంతింపజేశారు. మృతుని కుమారుడు మడికొండ దేవేందర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

అంజని శ్రీత నర్తనం మనోహరం

ప్రజాశక్తి - కల్చలర్



సదా మదిని త్యాగరాజ కృతి అభివ్యక్తీకరణలో మెలకువలు ప్రదర్శించిన అంజనీ శ్రీత.. జగదానంద కారక కీర్తనలో పద ముద్రలు హావభావాలతో నర్తించి ప్రేక్షక ప్రశంస పొందారు. రవీంద్రభారతి ప్రధాన వేదికపై త్రిష్ణ కూచిపూడి డాన్స్ అకాడమీ నిర్వహణలో ప్రముఖ నాట్య గురువు డాక్టర్ ఆలేఖ్య పుంజాల శిష్యురాలు అంజని శ్రీత కూచిపూడి నాట్య రంగప్రవేశం చేశారు. తొలి అంశం గా గణపతి స్తోత్రంతో నర్తనం ఆరంభించి దీక్షితార్ తరంగంలో లాస్యనర్తనంతో ప్రేక్షక ప్రశంసలు అందుకున్నారు. గురువు ఆలేఖ్య నట్టువాంగం చేయగా, చందర్ రావు గానం హృద్యంగా ఉంది. వినోద్ మృదంగంపై, సాయి కుమార్ వాయులీనంపై, రఘునందన్ రామకృష్ణ వేణువుపై సహకరించారు. అనంతరం జరిగిన సభలో సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ, ప్రఖ్యాత నాట్య గురువు పద్మభూషణ్ స్వప్న సుందరి, ఆంధ్ర నాట్య కళా కారుడు కళాకృష్ణ, తెలంగాణ సి.ఐ. డి. మహిళా రక్షణ విభాగం పోలీస్ ఉన్నతాధికారి సుమతి పాల్గొని గురువు ఆలేఖ్య ప్రతిభను నర్తకి అంజని నర్తనం ను అభినందించారు.

ఆరోపణలు రుజువు చేస్తే రాజీనామా చేస్తా

- బిఆర్ఎస్ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్యేల ఎరకేసు విషయంలో దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు బిజెపిని విమర్శిస్తుండటంతో దాన్ని తప్పుదోవపట్టించేందుకు నోటీసుల పేరుతో కుట్రలు చేస్తున్నారని తాండూర్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయాన్ని ఆయన తన పార్టీ నాయకులతో కలిసి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కర్నాటక నుంచి నోటీసులు వచ్చాయని చెప్పిన బండి సంజయ్ వాటిని నేటికీ చూపించలేదన్నారు. బిజెపి నాయకులకు అబద్ధాలు చెప్పడం వెన్నతో పెట్టిన విద్య అన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, రాష్ట్రంలో అధికార పార్టీ నేతలను కేంద్ర దర్యాప్తు సంస్థలతో టార్గెట్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను అమ్మవారి వద్ద సవాల్ చేశాననీ, బండి సంజయ్ తన సవాల్‌ను స్వీకరించలేదన్నారు. దాంతో బండి సంజయ్ చేసిన ఆరోపణలు తప్పని ప్రజలకు అర్థం అయిందన్నారు. బిజెపి నేతలు తనపై చేస్తున్న ఆరోపణలను రుజువు చేస్తే తాను రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. ఎక్కడికి రమ్మన్నా వస్తానని.. వేములవాడ లేదా తాండూరు బద్రేశ్వర స్వామి ఆలయం.. ఎక్కడైనా తాను రెడీ అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పాతబస్తీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కూతురిని చంపిన సవతి తండ్రి

- ఫోన్ ఎక్కువగా మాట్లాడుతుందని హత్య

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో



రాత్రి పూట ఫోన్ ఎక్కువగా మాట్లాడుతుందన్న కోపంతో సవతి తండ్రి తన కూతురిని గొంతు నులిమి హత్య చేసిన దారుణ సంఘటన హైదరాబాద్‌లోని ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాకారంలో ఆదివారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ జాహంగీర్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. బాకారానికి చెందిన రహీం ఉన్నీసా, షేక్ అక్బర్ దంపతులకు షేక్ ఆయాజ్, షేక్ నౌ సిన్ ఉన్నిసా, షేక్ యాస్మిన్ ఉన్నీసా (17) ముగ్గురు సంతానం. పదేండ్ల కిందట షేక్ అక్బర్ తాండూరులో జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందాడు. అనంతరం 2012లో రహీమున్నీసా మహమ్మద్ సాదిక్‌ను రెండో పెండ్లి చేసుకుంది. అప్పటి నుంచి ఆమె తన కుమారుడిని తన తల్లి వద్ద ఉంచింది. అలాగే తన తండ్రి ఇద్దరు కూతుళ్లతోపాటు మహమ్మద్ సాదిక్‌తో కలిసి బాకారంలో నివాసముంటోంది. యాస్మిన్ ఉన్నిసా 9వ తరగతి వరకు చదువుకుని ఇంటి వద్ద ఉంటోంది. యాస్మిన్ రాత్రి పూట తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండడంతో తండ్రి సాదిక్‌కు నచ్చేది కాదు. శనివారం మద్యం మత్తులో ఉన్న సాదిక్ ఇంటికి చేరుకునే సరికి యాస్మిన్ ఫోన్‌లో మాట్లాడుతుండడంతో ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున ఆమెను గొంతు నులిమి హత్య చేశాడు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

నవతెలంగాణ ఉద్యోగి శివకు పితృవియోగం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నవతెలంగాణలో క్లర్క్‌గా పనిచేస్తున్న ఎన్.శివ తండ్రి పెంటయ్య (83) ఆదివారం ఉదయం 7.30కు హైదరాబాద్‌లోని శ్రీరామ్‌నగర్ రాజీవ్‌గృహకల్పలోని తన నివాసంలో మృతి చెందారు. మృతదేహాన్ని నవతెలంగాణ సిజిఎం ప్రభాకర్, జనరల్ మేనేజర్ రఘు, శశి, మేనేజర్లు వీరయ్య, ఉపేందర్‌రెడ్డి నివాళులర్పించారు. శివ కుటుంబ సభ్యులను ఓదార్చారు. పెంటయ్య మృతికి సంతాపం తెలిపారు.

బిఆర్ఎస్ పార్టీలో చేరిన నాందేడ్ వాసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహారాష్ట్రలోని నాందేడు ప్రాంతానికి చెందిన దాదాపు 20 మంది బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని రాష్ట్ర హోం మంత్రి క్వార్టర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకుడు మహమ్మద్ అఖిల్ నాయకత్వంలో వీరు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా మహముద్ అలీ మాట్లాడుతూ... బిఆర్ఎస్ పార్టీని అధికారం కోసం స్థాపించలేదనీ, దేశాభివృద్ధి, ప్రజాసేవ కోసం ఏర్పాటు చేశారన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి జరుగుతోందని, అందుకు కారణం బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తమ విధులను చక్కగా నిర్వహించడమేనని తెలిపారు. రాష్ట్రంలో అన్ని మతాల సంక్షేమానికి బిఆర్ఎస్ పార్టీ కృషి చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో ఎంఎ మాటల్, జావేద్ అహ్మద్, మహమ్మద్ నవీద్, ఉమర్ షేక్, జావేద్ షేక్, మహమ్మద్ నౌమాన్ ,ఫైసల్ తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి రైతు బంధు నిధుల విడుదల

సంక్రాంతి నాటికి రైతులందరి ఖాతాల్లో జమ



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని రైతులకు సిఎం కెసిఆర్ శుభవార్త తెలిపారు. యాసంగి పంట కాలానికి అందించే పెట్టుబడిని రైతుబంధు నిధులను డిసెంబర్ 28 నుంచి విడుదల చేయడం ప్రారంభించాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్ రావును ఆదేశించారు. సిఎం ఆదేశాలతో... రైతు బంధు నిధులు సంక్రాంతి కల్లా రైతులందరి ఖాతాల్లో జమ కానున్నాయి. ఇందుకోసం రూ.7,600 కోట్లను రైతుల ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం జమ చేయనున్నది. రైతుబంధు దేశానికే ఆదర్శమనీ, పదో విడతతో దాదాపు రూ.66 వేల కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లోకి వెళ్లనున్నాయి. అన్నం పెట్టే రైతు అప్పులపాలు కాకూడదు, రైతు యాచించే స్థితిలో కాదు... శాసించే స్థాయిలో ఉండాలని ముఖ్యమంత్రి కెసిఆర్ ఆకాంక్షించారు. ఇప్పటివరకు తొమ్మిది విడతల్లో రూ.58 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమచేసినట్టు సిఎం చెప్పారు. రైతుబంధు, రైతుబీమా, సాగునీటి సదుపాయం, 24 గంటల ఉచిత కరంటుతో తెలంగాణ రైతులలో ఆత్మస్థైర్యం పెరిగింది. వ్యవసాయ రంగానికి తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న చేయూత దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వడం లేదు. 60 శాతం మందికి ఉపాధి కల్పించే వ్యవసాయ రంగానికి చేయూత ఇవ్వాలన్నదే సిఎం కెసిఆర్ ఆలోచన. కేంద్ర ప్రభుత్వం సహకారం లేకున్నా రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పథకాలను కెసిఆర్ విజయవంతంగా అమలు చేస్తున్నారు. నిదులు విడుదల చేస్తున్నందుకు సిఎం కెసిఆర్‌కు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

రైతు బంధు పథకం ద్వారా రైతులకు వానాకాలం, యాసంగి రెండు కాలాలకు ఎకరానికి పదివేల రూపాయల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం పంట పెట్టుబడిని అందించడం, దేశ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక కార్యాచరణగా సత్ఫలితాలనిస్తున్నది. ఉచిత సాగునీరు, ఉచిత విద్యుత్తుతో పాటు, రైతు బీమా, పంటలు పండించేందుకు నేరుగా రైతు ఖాతాలో పెట్టుబడిని అందించడం ద్వారా తెలంగాణ వ్యవసాయంలో విప్లవాత్మక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ అనుకూల కార్యాచరణ దేశానికి ఆదర్శంగా నిలవడమే కాకుండా.. దేశ వ్యవసాయ రంగ నమూనా మార్పునకు దారి తీసింది. ముఖ్యమంత్రి కెసిఆర్ వ్యవసాయ అనుకూల దార్శనిక నిర్ణయాలు, ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణాను దేశంలోనే అగ్రగామిగా నిలిపాయి. దేశ రైతాంగ సంక్షేమానికి, వ్యవసాయ ప్రగతికి బాటలు వేసే దిశగా పక్క రాష్ట్ర ప్రభుత్వాలను, కేంద్రాన్ని ప్రభావితం చేస్తున్నాయి. పలు మార్గాల నుంచి రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన రూ.40 వేల కోట్లను రాకుండా కేంద్రం తొక్కిపెట్టింది. రాష్ట్రానికి రావాల్సిన నిధులను ఇవ్వకుండా, ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తూ, తెలంగాణ రైతులను ప్రజలను కష్టాల పాలు చేయాలని కేంద్రం చూస్తున్నది. కేంద్రం ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా, తెలంగాణ రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి విషయంలో ఎన్ని కష్టాలెదురైనా రాజీ పడకుండా రైతులకు రైతు బంధు నిధులను టంచనుగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తున్నది. ఎలాంటి కోతలు లేకుండా, రైతులందరికీ పూర్తి స్థాయిలో, సకాలంలో రైతు బంధు నిధులు విడుదల చేయాలని ఆర్థికశాఖ కార్యదర్శిని సీఎం కేసిఆర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ నిర్ణయం, రైతాంగం, వ్యవసాయం పట్ల సీఎం కేసిఆర్ పాలనకున్న చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలిచిందని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు.



వరంగల్ కోర్టు ప్రాంగణంలో జ్యాడిషియ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్న కైలాష్ సత్యార్థి

బాలల హక్కులను కాపాడాలి

నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బాలల బంగారు భవిష్యత్‌కు వారి హక్కులను ప్రతి ఒక్కరూ కాపాడాల్సిన అవసరం ఉందని నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి అన్నారు. ఆదివారం హనుమకొండ జిల్లా వరంగల్ కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన జ్యూడిషరీ ప్రోగ్రామ్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్వల్ భయన్, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు వినోద్‌కుమార్, హైకోర్ట్ జడ్జి నవీన్‌రావుతో కలిసి ఆయన హాజరై మాట్లాడారు. వరంగల్‌లో పోక్సో యాక్ట్ కేసులు 256 ఉంటే 146 కేసులను పరిష్కరించారని, ఇందులో 40 కేసులకు శిక్ష పడిందని తెలిపారు. చిన్నారుల సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని అన్నారు. కోవిడ్ సమయంలో చిన్నారులపై లైంగికదాడులు రెట్టింపయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి ప్రపంచ వ్యాప్తంగా ఉందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు సమన్వయంగా కృషి చేస్తేనే బాలలపై జరుగుతున్న ప్రమాదాలను నివారించగలమని చెప్పారు. బాలలపై అసాంఘిక కార్యక్రమాలు ఎవరికి చెప్పాలో, ఎవరిని ఆశ్రయించాలో అన్న విషయాలపై పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బాలల హక్కుల దినోత్సవాలు జరగాలని, వారి హక్కులను కాపాడాలన్నారు. పిల్లలు సున్నితంగా ఉంటారని, వారిపై తల్లిదండ్రులు, సమాజం ప్రభావం గణనీయంగా ఉంటుందని చెప్పారు. ముఖ్యంగా బాలికలకు సొంత కుటుంబ సభ్యుల మధ్యనే రక్షణ కొరవడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారిపై జరుగుతున్న లైంగిక దాడుల గురించి ఎవరికీ చెప్పకపోవడంతో ఆ ప్రభావం బాలికలపై దీర్ఘ కాలంగా ఉంటుందన్నారు. తాను చేపట్టిన భారత్ యాత్ర మంచి ఫలితాలు ఇస్తుందని తెలిపారు. అనంతరం రాష్ట్ర ప్రధాన న్యాయమూర్తి ఉజ్వల్ భయన్ మాట్లాడుతూ.. పోక్సో కోర్టులు ఇతర జిల్లాల్లో కూడా విస్తరింపచేయాలని తెలిపారు. బాల్య వివాహాలు జరగడానికి కుటుంబ పెద్దల ప్రోత్సాహమే కారణమన్నారు. ప్రతి ఒక్కరూ నైతిక ప్రవర్తన అలవార్చుకోవాలని చెప్పారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ.. చిన్నారుల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వివరించారు. సమావేశానికి జిల్లా జడ్జి కె.రాధాదేవి సభకు అధ్యక్షత వహించగా హనుమకొండ, వరంగల్, పోలీస్ కమిషనర్ రంగనాథ్, కలెక్టర్లు రాజీవ్ గాంధీ హనుమంతు, డాక్టర్ గోపి, నగర పాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్య, కూడా చైర్మెన్ సంగం రెడ్డి సుంధర్ రాజ్, లా కార్యదర్శి నర్సింగ రావు, జడ్జి కృష్ణమూర్తి, బార్ కాన్సిల్ అధ్యక్ష కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ జిల్లాలో విషాదం


- పురుగుల మందు తాగి చెల్లి.., రోడ్డు ప్రమాదంలో అన్న దుర్మరణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆ అన్నాచెల్లెళ్ల చిన్నప్పుడే తల్లి ఆత్మహత్య చేసుకుని చనిపోయింది. దాంతో అమ్మమ్మే అన్నీ తానై పెంచి పోషించింది. కానీ ఏమైందో తెలియదు కానీ అనుకోకుండా చెల్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఆ యువతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా పోస్టుమార్టం కోసం వచ్చిన ఆమె సోదరుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి దుర్మరణం చెందాడు. ఈ విషాదకరమైన సంఘటన నల్లగొండ జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగింది. మృతుల బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడు మండలం ఊకొండి గ్రామానికి చెందిన దొడ్డి కేశయ్య భార్య 2006లోనే చనిపోగా వారికి సంధ్యారాణి(17), సాయి (19) ఉన్నారు. తల్లి చనిపోయిన నాటి నుంచి సంధ్యారాణి తన అమ్మమ్మ ఊరైన చౌటుప్పల్ మండలం తూర్పుగూడెంలో ఉంటూ పదవ తరగతి వరకూ అక్కడే చదివింది. ఏడాదిన్నర కింద ఊకొండికి వచ్చి ఇక్కడే ఉంటూ మునుగోడు కెజిబివిలో ఇంటర్ చదువుతోంది. బతుకు దెరువు కోసం సాయి వేరే ప్రాంతానికి కూలీకి వెళ్లి ఉంటున్నాడు. సొంత ఊరిలో ఇండ్లు లేకపోవడంతో వారు వ్యవసాయ బావి వద్ద గుడిసె వేసుకుని ఉంటుండగా శనివారం ఎవరూలేని సమయంలో సంధ్యారాణి పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆమె తండ్రి కేశయ్య గమనించి 108 వాహనంలో నల్లగొండకు తరలిస్తుండగా మర్గమధ్యలో చనిపోయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పోస్టుమార్టం కోసం వెళ్లి అన్న దుర్మరణం..

సొంత చెల్లెలు మృతి చెందగా మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చెల్లె పోస్టుమార్టం కోసం నల్లగొండకు వచ్చిన సంధ్యారాణి సోదరుడు సాయి (19)కి పెద్దబండ సమీపంలో గుర్తు తెలియని లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు సాయిని ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు.



శాశ్వత ఉపాధి కల్పించాలి

- కమ్యూనిస్టులు లేకపోతే దేశ భవిష్యత్తు ఏమిటనే చర్చ జరగాలి
- నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడ్డ లీడర్ యాకయ్య
- సంస్మరణ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కమ్యూనిస్టులు ఎక్కడ ఉన్నారన్న వారికి ధీటుగా అసలు కమ్యూనిస్టులే లేకపోతే దేశ భవిష్యత్తు ఏమిటనే చర్చ జరగాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే ప్రజలకు మేలన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణంలోని వినోభా కాలనీలో ఆదివారం సిపిఎం సీనియర్ నాయకులు దేవులపల్లి యాకయ్య సంస్మరణ సభ జరిగింది. తొలుత రాష్ట్ర కమిటీ సభ్యులు పి.సోమయ్య జెండావిష్కరణ చేయగా, అనంతరం తమ్మినేని స్థూపావిష్కరణ చేశారు. దేవులపల్లి యాకయ్య విజ్ఞాన కేంద్రానికి మాజీ ఎంపి, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మిడియం బాబూరావు శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రంథాలయాన్ని ప్రారంభించారు. యాకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కార్యదర్శి అబ్దుల్ నబి అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో తమ్మినేని మాట్లాడుతూ.. తాను నమ్మిన సిద్ధాంతం కోసం దేవులపల్లి యాకయ్య నిలబడ్డారని అన్నారు. సింగరేణి ఉద్యోగాన్ని వదిలి పార్టీ అభివృద్ధి కోసం పాటుబడ్డారని కొనియాడారు. కష్టపడి పనిచేసి కుటుంబాన్ని సైతం కమ్యూనిస్టు బాటలో పయనింపజేశారని గుర్తు చేశారు. ఎన్ని ఒడుదుడుకులు వచ్చినా పార్టీని వదలకుండా నిక్కచ్చిగా నిలబడ్డారన్నారు. ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలన్నీ తాత్కాలికమేనని, ప్రజల కొనుగోలుశక్తి పెరగాలంటే శాశ్వత ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. సమాజంలో అందరికీ అన్ని అవకాశాలు కల్పించడం కమ్యూనిస్టుల లక్షణమన్నారు. సామాజిక న్యాయంతోనే అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఖమ్మం, భద్రాద్రి, మహబూబాబాద్ జిల్లా పార్టీ కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు, అన్నవరపు కనకయ్య, సాదుల శ్రీనివాస్, సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు ఎం.సాయిబాబు, ఇల్లందు మున్సిపల్ చైర్మెన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



కేంద్రం అలా.. రాష్ట్రం ఇలా...

- బీడీ కార్మికుల నడ్డివిరుస్తున్న పాలకులు
- 28 శాతం జిఎస్‌టి, క్యాన్సర్ బొమ్మ ముద్రణతో తీవ్ర నష్టం
- రోజురోజుకు తగ్గిపోతున్న ఉపాధి
- 2011 నుంచి కనీస వేతన జిఒను అమలు చేయని రాష్ట్ర సర్కారు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉత్తర తెలంగాణలో బీడీ రంగం కీలకమైనది. దానిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మంది ఉపాధి పొందుతున్నారు. ఆయా నియోజకవర్గాల్లో నేతల గెలుపోటముల్లో ప్రభావం చూపే స్థాయిలో వారున్నారు. అలాంటి కార్మికులకు మేలు చేయాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలతో ఇప్పుడు వారి ఉపాధికే ఎసరు వచ్చింది. 28 శాతం జిఎస్‌టి, క్యాన్సర్ బొమ్మ ముద్రణతో కార్మికుల పొట్టగొట్టిన బిజెపి ప్రభుత్వం తాజాగా తునికాకుపైనా జిఎస్‌టి వేయాలని చెప్పటమంటే బీడీ పరిశ్రమ నడ్డి విరగ్గొట్టడమే. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వమూ తానేం తక్కువ కాదంటూ కనీస వేతనాల జిఒలను తొక్కిపెడుతూ తీవ్ర అన్యాయం చేస్తోంది. పింఛన్ల మంజూరులోనూ సవాలక్ష ఆంక్షలు పెడుతూ ఆయా కుటుంబాల్లో పంచాయతీ పెడుతోంది.

రాష్ట్రంలో 16 జిల్లాల్లో ఏడు లక్షల మంది బీడీ కార్మికులు దీనిపై ఆధారపడి జీవిస్తున్నారు. తునికాకు సేకరణ ద్వారా మరో ఐదు లక్షల మంది ఉపాధి పొందుతున్నారు. వీరిలో ఎక్కువ మంది ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ, బిసిలే. అందులోనూ మహిళా కార్మికులు ఎక్కువ. బీడీ పరిశ్రమ ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎక్కువగా విస్తరించి ఉంది. నిజామాబాద్, సిద్దిపేట, సిరిసిల్ల, కామారెడ్డి, నిర్మల్, వనపర్తి, కరీంనగర్, జగిత్యాల, ఆదిలాబాద్ జిల్లాల్లో బీడీ కార్మికులు ఎక్కువగా ఉన్నారు. 45 నియోజకవర్గాల్లో రాజకీయ నాయకులు గెలుపోటములను ప్రభావితం చేసే స్థాయిలో ఉన్నారు. లక్షల మంది ఆధారపడి జీవిస్తున్న పరిశ్రమను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ధ్వంసం చేస్తోంది. సిగార్ అదర్ టొబాకో ఉత్పత్తుల యాక్ట్ -2013కు సవరణలు చేసి బీడీ కట్టలపై పుర్రెంబొమ్మ, 2014లో క్యాన్సర్ బొమ్మను ముద్రించాలని రాష్ట్రాలకు ఆదేశించడం బీడీ పరిశ్రమపై చాలా ప్రభావం పడింది. ఆ తర్వాత బీడీ కట్టలపై 18 శాతం ఉన్న జిఎస్‌టిని 28 శాతానికి పెంచింది. తాజాగా తునికాకు సేకరణపైనా జిఎస్‌టి విధించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. ఇలా బీడీ పరిశ్రమపై దెబ్బమీద దెబ్బ వేస్తూ ఆ పరిశ్రమ నడ్డివిరిచే పనిలో మోడీ సర్కారు ఉంది. రాష్ట్రంలో బిజెపి ఎంపిలు బండి సంజయ్, అర్వింద్‌కుమార్, ఎస్.బాపూరావు ఎంపిలుగా ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లోనే బీడీ పరిశ్రమ విస్తరించి ఉంది. కేంద్రం తీవ్ర అన్యాయం చేస్తున్నప్పటికీ ఆ ముగ్గురూ పల్లెత్తు మాట కూడా మాట్లాడకపోవడం బీడీ కార్మికుల పట్ల వారి చిత్తశుద్ధి ఏంటో ఇట్టే అర్థమవుతోంది. కేంద్రం తీరు వల్ల చాలా కంపెనీలు బీడీ తయారీని తగ్గించేశాయి. దీంతో కార్మికులకు 10 నుంచి 15 రోజులకు మించి పనిదినాలు దక్కట్లేదు. గతంలో 26 పనిదినాలు కార్మికులకు దక్కేవి.

రాష్ట్ర ప్రభుత్వం తాత్సారం చేస్తున్న 73 షెడ్యూల్ పరిశ్రమల జాబితాలో బీడీ రంగం కూడా ఉంది. దీనికి సంబంధించి కనీస వేతన నిర్ణయం జరిగింది. 2011 ఫిబ్రవరిలో జిఒ నెంబర్ 41 కూడా విడుదలైంది. ఆనాడు పరిశ్రమల యాజమాన్యాల ఒత్తిడితో రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గి 98 శాతం కార్మికుల పొట్టగొట్టింది. జిఒ నెంబర్ 81 తీసుకొచ్చి బీడీ కార్మికుల కుటుంబాలకు అన్యాయం చేసింది. ఆ జిఒ గడువు అయిపోయినప్పటికీ పెరిగిన వేతనాలు మాత్రం అమల్లోకి రాలేదు. వాస్తవానికి ప్రతి వెయ్యి బీడీలకు రూ.221. 21 పైసలు ఇవ్వాలి. ప్రస్తుతం వెయ్యి బీడీలకు రూ.170-రూ.150 మాత్రమే కార్మికులకు దక్కుతున్నది. ఒకవేళ జిఒ నెంబర్ 41 అమలయ్యి ఉంటే రూ.400 దక్కేవి. ఇది ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ పాపం. ఈ విషయంలో టిఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఏమీ చేయలేదు. దీంతో ఒక్కో కార్మికుడు వెయ్యి బీడీలపై రూ.230 నుంచి రూ.250 మేరకు నష్టపోతున్నాడు. తెలంగాణ రాష్ట్రమొస్తే బీడీ కార్మికుల బతుకుల్లో వెలుగులు నింపుతానన్న సీఎం కేసీఆర్ హామీ నీటి మీద రాతలాగే మిగిలింది. పైగా ఆ కుటుంబాల్లో చీకట్లు అలుముకుంటున్నాయి. జీవన భృతి విషయంలోనూ తీవ్ర అన్యాయం చేస్తున్నది. 2014 ఫిబ్రవరి లోపు పీఎఫ్ నెంబర్లు ఉన్నవారికే పింఛన్లు ఇస్తామని మెలికపెట్టింది. ఇంట్లో ఎవరికైనా వృద్ధాప్య, వికలాంగ, వితంతు పింఛన్లు వస్తే బీడీ కార్మికులకు ఇవ్వబోమని తిరకాసు పెట్టింది. ఇది ఆ కుటుంబాల్లో పంచాయితీ పెట్టి కూర్చున్నది.

కనీస వేతనాల జీవో విడుదల చేయాలి..అందరికీ పింఛన్ ఇవ్వాలి

ఎస్వీ.రమ, తెలంగాణ బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

కరోనా సమయంలో సిఐటియు అనేక పోరాటాలు చేసి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నెలకు రూ.6 వేలు ఇప్పించగలిగాం. రెండు వేతన అగ్రిమెంట్లు కూడా చేయించుకోగలిగాం. బీడీ కార్మికుల సమస్యలపై బిజెపిగానీ, టిఆర్ఎస్‌గానీ పోరాడిందేమీ లేదు. బీడీ కార్మికుల కనీస వేతనాల జిఒను వెంటనే విడుదల చేయాలి. 26 రోజుల పనిదినాలు కల్పిస్తూ ప్రతి వెయ్యి బీడీలకు రూ.800 చెల్లించాలి. పీఎఫ్, నాన్‌పీఎఫ్ అనే తేడా లేకుండా బీడీ కార్మికులందరికీ ప్రతి నెలా పింఛన్ ఇవ్వాలి.

ఎయిర్‌పోర్టు మెట్రో అలైన్‌మెంట్ ఖరారు

- గ్రౌండ్ డేటా సేకరణ, పనులు వేగవంతం కోసం సర్వే బృందాలు
- ప్రధాన రహదారుల వెంబడి మెట్రో స్టేషన్ల నిర్మాణాలు
- మెట్రో కారిడార్ ఉండాలని ఇంజనీర్లకు మెట్రో ఎమ్‌డి ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎయిర్‌పోర్టు మెట్రో నిర్మాణ పనులు వేగవంతం చేయాలని హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్ నిర్ణయించింది. అలైన్‌మెంట్ ఖరారు, గ్రౌండ్ డేటా సేకరణ తదితర పనులు త్వరితగతిన చేసేందుకు రెండు సర్వే బృందాలను కూడా ఏర్పాటు చేసినట్టు హెచ్ఎఎంఎల్ ఎండి ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. మెట్రో పిల్లర్లు, వయాడక్ట్, మెట్రో స్టేషన్ల నిర్మాణం, వాటి ఎత్తు ఎంత ఉండాలనే విషయంలో ఈ డేటా కీలకం కానుంది. ఈ మేరకు సర్వే పనులను ఆదివారం హెచ్ఎఎంఎల్ సీనియర్ ఇంజినీర్ల బృందంతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి నార్సింగి జంక్షన్ వరకు ఉన్న ఎయిర్‌పోర్ట్ మెట్రో మార్గాన్ని పరిశీలించారు. దాదాపు 10 కిలోమీటర్ల పొడవున ఉన్న ఈ మార్గంలో కాలినడకన నడుస్తూ ఇంజనీర్లకు, సర్వే బృందాలకు ఎన్వీఎస్ రెడ్డి తగిన ఆదేశాలిచ్చారు. ఆ వివరాలు..

మెట్రో స్టేషన్ల నిర్మాణం ప్రధాన రహదారి జంక్షన్‌లకు దగ్గరగా ఉండాలని సూచించారు. సిఎం కెసిఆర్ ఆదేశించిన విధంగా ఎయిర్‌పోర్టు మెట్రో కారిడార్‌ను నగర విస్తరణ ప్రణాళికలో భాగంగా నగర శివారు ప్రాంతాల అభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. ఈ కారిడార్ కేవలం విమానాశ్రయ ప్రయాణీకులకు మాత్రమే కాకుండా, ఇతరులకూ ఉపయోగపడేలా ఉండాలని సిఎం ఆదేశించినట్టు తెలిపారు. భవిష్యత్తుని దృష్టిలో ఉంచుకుని ఇక్కడ నిర్మించే మెట్రో స్టేషన్లు, అవసరమైన స్కైవాక్‌ల నిర్మాణానికి సంబంధించి సూచించాలని సర్వే బృందాన్ని ఎండీ ఆదేశించారు. మెట్రో స్టేషన్లకు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి ప్రయాణీకుల వాహనాల పార్కింగ్ ఏరియా కోసం సూచించాలని చెప్పారు.

రాయదుర్గ్ స్టేషన్ నుంచి సుమారు 900 మీటర్ల మేరకు ఎయిర్‌పోర్టు మెట్రో కోసం రాయదుర్గ్ స్టేషన్‌ను పొడిగిస్తున్నప్పుడు, పొడిగించిన బ్లూ లైన్ కొత్త టెర్మినల్ స్టేషన్, ఎయిర్‌పోర్ట్ మెట్రో స్టేషన్‌లను అనుసంధానానికి సంబంధించిన అవకాశాలను అన్వేషించామన్నారు. ఈ ప్రదేశంలో స్థలాభావం ఉన్నందువల్ల ఐకియా భవనం తర్వాత ఎల్అండ్‌టీ, అరబిందో భవనాల ముందు ఈ రెండు కొత్త స్టేషన్లు ఒకదానిపై ఒకటి నిర్మించే అవకాశాన్ని పరిశీలించాలన్నారు.



పనులు పర్యవేక్షిస్తున్న మెట్రో ఎమ్‌డి

మొదటి రెండు అంతస్తుల్లో ఎయిర్‌పోర్ట్ కొత్త రాయదుర్గ్ స్టేషన్, పొడిగించబడిన కొత్త బ్లూలైన్ స్టేషన్ ఎగువ రెండు అంతస్తుల్లో ఉండేలా డిజైన్ చేయాలన్నారు. మెట్రో కారిడార్-2 (గ్రీన్ లైన్)లో నిర్మించిన జేబీఎస్ స్టేషన్, అలాగే అమీర్‌పేట్ ఇంటర్‌చేంజ్ స్టేషన్ల మాదిరిగా నాలుగు అంతస్తుల్లో ఈ స్టేషన్‌ల నిర్మాణం ఉండబోతున్నట్టు తెలిపారు.

ప్రతిపాదిత ఎయిర్‌పోర్ట్ మెట్రో మొదటి స్టేషన్‌కి ప్రవేశం.. నిష్క్రమణలు ప్లాన్ చేసేముందు, ఇక్కడకు దగ్గరలోనే ట్రాన్స్‌కో సంస్థ ఇటీవల వేసిన 400 కేవీ అదనపు హై వోల్టేజ్ భూగర్భ విద్యుత్ కేబుళ్లను పరిగణలోకి తీసుకొని వాటిని మార్చకుండానే డిజైన్ చేసేలా ప్లాన్ చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. మెట్రో మొదటి దశలో సైబర్ టవర్స్ జంక్షన్ ఫ్లైఓవర్ దగ్గర చేసినట్టు, ఫ్లైఓవర్ ర్యాంప్ పక్కనే మెట్రో పిల్లర్లు ఉండాలన్నారు. బయోడైవర్సిటీ జంక్షన్ వద్ద మెట్రో స్టేషన్‌ను ప్లాన్ చేసేటప్పుడు, ఇదే మార్గంలోనే సమీప భవిష్యత్తులో నిర్మించనున్న బిహెచ్ఈఎల్-లక్డీకాపూల్ మెట్రో కారిడార్‌పై కూడా దృష్టి సారించాలని సూచించారు. నార్సింగి, కోకాపేట, మరి ఇతర సమీప ప్రాంతాలలో వస్తున్న కొత్త కాలనీలు, వాణిజ్య సదుపాయాల అవసరాలను గుర్తించి నార్సింగి జంక్షన్ సమీపంలో నిర్మించే మెట్రో స్టేషన్ స్థానాన్ని ప్లాన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎఎంఎల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ డీవీఎస్ రాజు, చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ బి. ఆనంద్ మోహన్, జనరల్ మేనేజర్‌లు ఎం. విష్ణువర్ధన్ రెడ్డి, రాజేంద్ర ప్రసాద్ నాయక్, ఇతర సీనియర్ ఇంజనీర్లు పాల్గొన్నారు.